మునగపాకలో విషాదం

- నెల్లూరు జిల్లా నేలటూరు వద్ద సముద్రంలో మునిగి మెడికో గల్లంతు
- ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్న షణ్ముఖ నాయుడు
- సహచర విద్యార్థులతో కలిసి బీచ్‌కు వెళ్లినప్పుడు ఘటన


-వార్త మెయిన్ ఎడిషన్‌లో

ఐదేళ్ల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

అస్తవ్యస్తంగా కామునిగెడ్డ రిజర్వాయర్ నిర్వహణ



- తుప్పు పట్టిన తూముల తలుపులు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- రిజర్వాయర్ గట్టుకు పలుచోట్ల రంధ్రాలు
- వృథాగాపోతున్న నీరు
- ఒక్క ఏడాది కూడా నిధులు ఇవ్వని వైసీపీ పాలకులు



కామునిగెడ్డ మినీ రిజర్వాయర్. (ఇన్‌సెట్‌లో) రిజర్వాయర్ గట్టుకు రంధ్రాలు పడి వృథాగా పోతున్న నీరు

రావికమతం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ధర్మవరం రెవెన్యూ పరిధిలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన కామునిగెడ్డ రిజర్వాయర్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఎప్పటికప్పుడు నిర్వహణ, మరమ్మతు పనులు చేయకపోవడంతో ఆయకట్టుకు నీరు సరిగా అందక రైతులు ఇబ్బంది ఎదుటున్నారు. పొలాలకు నీరు అందించే తూముల ఇనుప తలుపులు తుప్పు పట్టడంతో ఎత్తడానికి, దించడానికి వీలుకావడంలేదు. రిజర్వాయర్ గట్టుకు పలుచోట్ల రంధ్రాలు పడి నీరు వృథాగా పోతున్నది. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమస్యలు మరింత పెరిగాయి.

రావికమతం మండలం ధర్మవరం పంచాయతీ ఎగువన ఉన్న దేముడు కొండ, చలిసింగం కొండల మీద నుంచి వచ్చే వర్షపు నీటిని ఆధారంగా చేసుకుని 1987లో ఇక్కడ కామునిగెడ్డ పేరుతో మినీ రిజర్వాయర్ నిర్మించారు. కుడి, ఎడమ తూముల ద్వారా పాత ధర్మవరం, కొత్త ధర్మవరం, వలసలపాలెం, గంపవానిపాలెం, కొత్తకోటతోపాటు రోలుగుంట మండలం దిబ్బలపాలెం గ్రామాల పరిధిలో సుమారు 1,500 ఎకరాలకు ఖరీఫ్‌లో నీరు అందుతుంది. 20 కుటుంబాలకు చెందిన గిరిజన మత్స్యకారులు రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తూ ఉపాధి పొందుతుంటారు. ఆరేళ్ల క్రితం వరకు కాలువల్లో పూడికతీత, తూముల గేట్ల నిర్వహణ ... మిగతా 6వ పేజీలో

నీరు వృథా అవుతోంది



కామునిగెడ్డ మినీ రిజర్వాయర్‌కు ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేస్తుంటే ఎటువంటి సమస్యలు తలెత్తవు. గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు తూముల తలుపులు పాడయ్యాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తలుపుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. కానీ వైసీపీ హయాంలో నిర్వహణను గాలికొదిలేశారు. ప్రస్తుతం పొలాల్లో పంటలేమీ లేవు. కానీ తూముల గేట్లు పాడైపోవడంతో కాలువల్లో నిరంతరాయంగా నీరు ప్రవహిస్తూ వృథాగా పోతున్నది.

- అనపర్తి అప్పారావు, కామునిగెడ్డ రిజర్వాయర్ మాజీ చైర్మన్



ప్రస్తుతం పొలాల్లో పంటలు లేకపోయినా.. కాలువలో ప్రవహిస్తున్న నీరు



శిథిలమైన తూము తలుపులు

ఫుట్‌పాత్‌లు కబ్జా!

చిరు వ్యాపారుల నుంచి షాపింగ్ మాల్స్ వరకూ ఇష్టారాజ్యంగా ఆక్రమణ

- కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లతోపాటు రోడ్డుపైనే వ్యాపారాలు
- పాదచారులు రోడ్లపై నడవాల్సిన దుస్థితి
- వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య
- కళ్లెదుట కనిపిస్తున్నా పట్టించుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు



చిననాలుగురోడ్ల జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌పై సామగ్రి ఉంచిన వ్యాపారి

తుమ్మపాల (అనకాపల్లి), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్రంలో ఫుట్‌పాత్‌లే కాదు.. రహదారులు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. చిరు వ్యాపారులతోపాటు శాశ్వత దుకాణదారులు, పెద్ద వ్యాపారులు కూడా ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. వస్తువులు, సామగ్రిని అడ్డుగా పెట్టడంతో పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తున్నది. నిత్యం రద్దీగా వుండే మెయిన్ రోడ్డు, నెహ్రూచౌక్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, తుమ్మపాల, కొత్తూరు వైపులకు వెళ్లే రోడ్లు, రింగురోడ్డులో ఈ సమస్య అధికంగా వుంది.

అనకాపల్లి జిల్లా కేంద్రంగా అవతరించడంతో ప్రజల రాకపోకలతోపాటు వాహనాల రద్దీ కూడా పెరుగుతున్నది. భారీ షాపింగ్ మాల్స్ సైతం ఏర్పాటు అవుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి కొనుగోలుదారులు తరలి వస్తున్నారు. దీంతో ప్రధాన రహదారులు



నెహ్రూచౌక్ వద్ద ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన పండ్ల దుకాణం

ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడుతున్నాయి. పండుగ సమయాల్లో రద్దీగా మరింత అధికంగా వుంటుంది. అయితే పాదచారుల రాకపోకలకు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు, ఆయా దుకాణాలు, షాపింగ్ మాల్స్ యజమానులు పోటీ పడి మరీ ఆక్రమించేస్తున్నారు. షాపులో విక్రయించే వస్తువుల్లో కొన్నింటిని ఫుట్‌పాత్‌పై పెడుతున్నారు. మరికొంతమంది ఒక అడుగు ముందుకేసి ఫుట్‌పాత్‌లపై షెడ్లు వేసుకొని దర్జాగా వాడకుంటున్నారు. ప్రధానంగా దుస్తులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, గృహోపకరణాల దుకాణాలు, పండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. వ్యాపార సముదాయాల్లో వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయకపోవడంతో మెయిన్‌రోడ్డు పైనే వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో జనం రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. దీనికితోడు ... మిగతా 6వ పేజీలో



చిననాలుగురోడ్డులో ఫుట్‌పాత్‌పై కుప్పగా పోసిన గుమ్మడి కాయలు



రింగురోడ్డు వద్ద ఫుట్‌పాత్‌పై ఒక షోరూమ్‌కు చెందిన ఫ్రిజ్‌లు



థింసా నృత్య ప్రదర్శన చేస్తున్న గిరిజన కళాకారులు

ఘనంగా ముగిసిన అరకు చలి ఉత్సవ్ వేడుక

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ప్రదర్శనలు

అరకులోయ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

అరకులోయలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'అరకు చలి ఉత్సవ్' ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఉత్సవ్‌కు హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో పాటు గాయకులు ఎం.ఎం.శ్రీలేఖ, వందేమాతరం శ్రీనివాస్, మంగ్లీ ఆలపించిన గీతాలు, టీవీ ఆర్టిస్టుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధాన వేదికపై ఫ్యాషన్ షో అలరించింది. ప్రధాన వేదిక ఆవరణలో ఆదివాసీలు, ఇతరుల చేతి వృత్తుల ఉత్పత్తులతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం సుంకరమెట్ట కాఫీ తోటల్లో సుమారు మూడు కిలో మీటర్ల మేర నిర్వహించిన ట్రెకింగ్‌లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజన మ్యూజియం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.



అరకు చలి ఉత్సవ్‌కు హాజరైన జనం

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీకి నేడు నోటిఫికేషన్



నేటి నుంచి పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

- 11న పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్
- విశాఖ కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగనుంది. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదలచేస్తారు. అదే రోజు ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ఈనెల పదోతేదీ వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలోని 123 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో 21,555 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

రాష్ట్రంలో ఓటరుగా ఉంటేనే ...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కడైనా ఓటరుగా నమోదై ఉండాలి. అభ్యర్థి జనరల్ అయితే రూ.10 వేలు/ ఎస్సీ,ఎస్టీలైతే రూ.ఐదువేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. పూర్తిచేసిన నామినేషన్ ఫారం, ఆస్తులు, అప్పులు, కుటుంబానికి చెందిన సమాచారంతో అఫిడవిట్, ఓటరుగా ఉన్న వివరాలను సంబంధిత అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్‌పై ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఉన్న పదిమంది ఓటర్లు బలపరుస్తూ సంతకాలు చేయాలి. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతిస్తారు. నామినేషన్ల దాఖలు సమయంలో సందేహాలు నివృత్తి, ఇతరత్రా సహాయం కోసం కలెక్టరేట్ మొదటి అంతస్తు పైకి వెళ్లేటప్పుడు మెట్లకు ఎదురుగా ఉన్న చాంబర్‌లో ... మిగతా 6వ పేజీలో

మొరాయించిన చెరకు లారీ

- బీఎన్ రోడ్డులో రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

చోడవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

చోడవరం-గోవాడ మధ్య బీఎన్ రోడ్డుపై చెరకు లారీ మరమ్మ తులకు గురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని కొత్తూరు జంక్షన్ దాటిన తరువాత సుమా రు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఇరుకుగా వున్న మదుం వద్ద చెరకు లారీ పక్కకు ఒరిగిపోయి అడ్డంగా ఉండిపోయింది. దీంతో పక్క నుంచి కూడా వాహనాలు.. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపో యాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు ప్రైవేటు వాహనాల డ్రైవర్లు చొరవ తీసుకుని, చెరకు లారీని పక్కకు తీయించారు. దీంతో దాదాపు రెండు గంటల తరువాత వాహనాల రాకపోకలు మొదలయ్యాయి.



మరమ్మతులకు గురై నిలిచిపోయిన చెరకు లారీ



బీఎన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

చేపల వేట నిషేధ భృతికి నిరీక్షణ

ఎనిమిది నెలలు అవుతున్నప్పటికీ మత్స్యకారులకు అందని పరిహారం

- గత ఏడాది ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో చెల్లించని అధికారులు
- జిల్లాలో 2,168 మందికి రూ.2.16 కోట్లు పెండింగ్
- నిధులు విడుదల చేయాలని కూటమి ప్రభుత్వానికి వినతి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్రంలో చేపల వేట నిషేధానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకు పరిహారం అందలేదని జిల్లాలోని పలు మండలాల మత్స్యకారులు వాపోతున్నారు. మరబోట్ల ద్వారా సముద్రంలో వేట సాగించే రెండు వేల పైచిలుకు మంది మత్స్యకారులకు పది వేల రూపాయల చొప్పున రెండు కోట్ల రూపాయల మేర అందాల్సి వుంది.

మత్స్య సంపద పునరుత్పత్తి సమయంలో ఏటా ఏప్రిల్ 16వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటను ప్రభుత్వం నిషేధిం చింది. ఇది చాలా ఏళ్ల నుంచి అమలవుతున్నది. ఈ సమయంలో మత్స్యకారులకు జీవనోపాధి వుండదు. వీరికి చేపల వేట మినహా మరో పనిచేయడం తెలియదు. దీంతో తమను ఆర్థికంగా ఆదుకోవాలన్న మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు 1996లో అప్పటి టీడీపీ ఒక్కో మత్స్యకారునికి రూ.2 వేల చొప్పున పరిహారం అందజేయడం ప్రారంభించింది. అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి అందుతున్నది. కాలక్రమేణా ప్రభుత్వం భృతిని పెంచుతుండడంతో గత ఏడాది రూ.10 వేలకు చేరింది. ఏటా సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలోనే మత్స్యశాఖ వద్ద నమోదైన వివరాల మేరకు ఆర్థిక సాయం అందజేసేది. అయితే గత ఏడాది చేపల వేట నిషేధ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో వుండడంతో మత్స్యకారులకు పరిహారం (భృతి) అందలేదు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో



బోటును తీరానికి చేరుస్తున్న మత్స్యకారులు



సముద్రంలో చేపల వేటపై నిషేధ సమయంలో పూడిమడక తీరంలో నిలిపి ఉంచిన బోట్లు (ఫైల్ ఫొటో)

ఇంటర్వ్యూ..

చురుగ్గా గోకులం షెడ్ల నిర్మాణాలు

పెట్ల నరేశ్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, కోటవురట్ల



ప్రశ్న: మండలానికి ఎన్ని గోకులాలు షెడ్లు మంజూరుచేశారు.

జవాబు: వంద మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం 27షెడ్లు మంజూరు కాగా నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మరో 50షెడ్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం.

ప్ర: ప్రస్తుతం పశు ఆరోగ్యశిబిరాలు ఎన్నిగ్రామాల్లో పూర్తిచేశారు.

జ: 14 గ్రామపంచాయతీల్లో పశుఆరోగ్య శిబిరాలు పూర్తయ్యాయి.

ప్ర: పశు ఆరోగ్య శిబిరాల్లో కుక్కలు రాబిష్ వ్యాక్సిన్ వేస్తున్నారా?

జ: కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేసేందుకు స్పెషల్ డ్రైవ్‌లేదు. కుక్కలు తీసుకువస్తే వ్యాక్సిన్ వేస్తాం.

ప్ర: కోటవురట్ల పశువైద్యశాల పరిధిలో ఎన్ని ఆస్పత్రులు ఉన్నాయి?

జ: పాములవాక, తంగేడు, కె.వెంటాపురం గ్రామాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి

ప్ర: ఆస్పత్రిలో దాకర్లు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: తంగేడు, కోటవురట్లల్లో అటెండర్ పోస్టులు కొరతగా ఉన్నాయి

ప్ర:. మండలంలో పశుగణన సర్వే ఎంతవరకు చేశారు?

జ: మండలంలో పశుగణణ సర్వే 82 శాతం పూర్తయింది. 18 శాతం మిగిలింది.

ప్ర: ఆస్పత్రుల్లో ఏమైనా మందులు కొరత ఉందా?

జ: ప్రస్తుతానికి మందుల కొరత లేదు.

'పేట' ఇన్‌చార్జి కార్యదర్శిగా అప్పలశివరామ్

పాయకరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎల్.అప్పలశివరామ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన సీహెచ్.రవికుమార్ వర్మ వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో మండలంలోని పీఎల్.పురం పంచాయతీ కార్యదర్శి ఎల్.అప్పలశివరామ్‌ని ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమిస్తూ ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఉత్తర్వులు జారీచేశారు.

సత్యవరంలో ఘనంగా సప్తాహ మహోత్సవం



భజన చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరంలో ఆదివారం 37వ సప్తాహ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. 1989వ సంవత్సరం నుంచి ప్రతీ ఏటా గ్రామస్థుల సహకారంతో ఈ సప్తాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు తెలిపారు. సప్తాహం ప్రారంభం నుంచి వారం రోజులుపాటు రాత్రి పగలు నిర్విరామంగా భజనలు చేస్తూ, కీర్తనలు ఆలపిస్తారు. అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భజన సమాజాల వారు భజనలు చేయడానికి వస్తారు. వారం రోజులు గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకుంటుంది.

ఉపమాక క్షేత్రంలో మాఘమాసం పూజలు

నక్కపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రం మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తులతో కోలాహలంగా మారింది. మాఘమాసంలో ప్రత్యక్ష దైవం సూర్యనారాయణమూర్తికి పూజలు చేసే భక్తుల్లో చాలా మంది ఉపమాక ఆలయానికి వచ్చారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఆదిత్య హృదయం పారాయణం చేశారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రాంబిల్లి రూరల్ ఫీడర్ సంబంధించి లైను నిర్వహణ పనులు చేపట్టేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్నచోట నిబంధనలు ప్రకారం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడు పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

మెడికల్ విద్యార్థి గల్లంతుతో మునగపాకలో విషాద ఛాయలు

మునగపాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మెడికల్ విద్యార్థి నేలటూరు బీచ్‌లో గల్లంతు కావడంతో మునగపాకలో విషాదఛాయలు అలుముకున్నాయి. మునగపాక గ్రామానికి చెందిన పెంటకోట కాశి దశాబ్దాలు కాలంగా సిమెంట్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు పెంటకోట షణ్ముఖనాయుడు నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో చేరాడు. ప్రతి రోజు కుమారుడును యోగక్షేమాలు అడుగుతూ సంతోషంగా గడుపుతున్న తల్లిదండ్రులు ఆదివారం పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. మీ కుమారుడు నేలటూరు బీచ్‌లో గల్లంతయ్యాడని కళాశాల నుంచి వచ్చిన ఫోన్ సమాచారానికి తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. తేరుకున్న తల్లిదండ్రులు క్షణం ఆలస్యం చేయకుండా హుటాహుటున సంఘటనాస్థలానికి వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే బంధువులు, గ్రామస్థులు యువకుని ఇంటికి భారీగా తరలివచ్చారు. కుటుంబసభ్యులను ఓదార్చే ప్రయత్నం చేశారు.



విషాదంలో కుటుంబ సభ్యులు

పరాయి పంచన 'పేట' పంచాయతీ కార్యాలయం

- పాత కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో తొలగింపు
- రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు
- 40 షాపులు,పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి నిర్ణయం
- శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే అనిత
- కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ పంపిన ప్రతిపాదనలు



రాజుగారిబీడులో అద్దె భవనంలో ఉన్న పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం

పాయకరావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పంచాయతీకి సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగుతోంది. పట్టణంలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయాన్ని తొలగించిన అధికారులు నూతన భవనం నిర్మాణంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. దీంతో అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. పాలకవర్గాల సమావేశాలు ఆరుబయట రేకుల షెడ్డులో నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది.

జిల్లాకు ముఖద్వారంగా ఉన్న పాయకరావుపేట పట్టణం వాణిజ్య, విద్యా, ఉపాధి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణంలో 30 వేల జనాభా నివాసముంటోంది. అటువంటి పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి 2017లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మ్యాచింగ్ గ్రాంటుగా రూ.15 లక్షలు మంజూరయ్యాయి. అయితే మెయిన్‌రోడ్డులో ఉన్న ఈ పంచాయతీ భవనాన్ని షాపింగ్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయడం ద్వారా పంచాయతీకి ఆదాయం పెంచాలని అప్పటి పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు రూ.1.15 కోట్ల అంచనా బడ్జెట్‌తో ఆమోదం తెలిపింది. ఈ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 20, ఫస్ట్ ఫ్లోర్‌లో మరో 20 కలిపి మొత్తం షాపులు నిర్మించడంతోపాటు సెకండ్ ఫ్లోర్‌లో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎస్టిమేట్లు రూపొందించారు. పనిలో పనిగా అప్పటి ఎమ్మెల్యే వంగలపూడి అనిత శంకుస్థాపన కూడా చేశారు. ఈ తరువాత నుంచి దీనిపై అధికారులు గాని, ప్రజాప్రతినిధులుగాని దృష్టి పెట్టలేదు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధుల సమీకరణ జరక్కపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపాదనలు మూలనపడ్డాయి. పట్టణంలోని రాజుగారిబీడులోని చిన్న అద్దె భవనంలో సర్పంచ్ చాంబర్, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బందితో పాటు ప్రజారోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్ల నిర్వహణ, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ విభాగాల సిబ్బంది ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా సచివాలయం-1 కార్యాలయ ఉద్యోగులు కూడా ఇదే భవనం ఆవరణలోని చిన్న గదిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక పాలకవర్గాల సమావేశాలు, తరచూ నిర్వహించాల్సిన గ్రామసభలు చిన్న షెడ్డులో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఒకవేళ పాత పంచాయతీ కార్యాలయం తొలగించి చేపట్టిన సచివాలయం-1 భవన నిర్మాణం పూర్తయినా దానిలో సచివాలయం, పంచాయతీ కార్యాలయాలు రెండూ నిర్వహణ కష్టంగా మారనుంది. దీనిపై ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్‌ని వివరణ కోరగా.. కొత్తగా పంచాయతీ భవనాల మంజూరు కోసం ప్రభుత్వం ఇటీవల కోరడంతో అవసరమైన ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు.

కొండెక్కిన కోతుల పట్టివేత

- వానరాల దాడులతో పట్టణ వాసులకు ఇబ్బందులు
- ఇటీవల పాఠశాలల్లోకి చొరబడిన వానర మూక
- భీతిల్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఎమ్మెల్యే ఆదేశించినా చర్యలు తీసుకోని మునిసిపల్ అధికారులు



కొత్తపేట ప్రధాన రోడ్డుపై విచ్చల విడిగా సంచరిస్తున్న కోతుల మూక(ఫైల్)

ఎలమంచిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో కోతుల పట్టివేత కార్యక్రమం కొండెక్కింది. ఇప్పటివరకు కోతుల గుంపు ఇళ్లు, రోడ్లపై మకాం వేసి ప్రజలును భయభ్రాంతులకు గురి చేసేవి. అయితే ఇటీవల కోతుల గుంపు రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ హైస్కూలు ఉన్న ప్రాంగణంలోకి చొరబడడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఎలమంచిలి పట్టణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వానర మూక పట్టివేత కార్యక్రమం అటకెక్కింది. ఏళ్ల తరబడి కోతుల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజానీకం ఈ సమస్యకు ఎప్పుడు చెక్ పడుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని మిలట్రీ కాలనీ, రామ్‌నగర్, కొత్త పేట, ఏఎస్ఆర్ కాలనీ, నాగేంద్రకాలనీ ప్రాంతాల్లో ఇళ్లలోకి ప్రవేశించి గృహోపకరణ వస్తువులతో పాటు తినుబండారాలను సైతం సర్వనాశనం చేస్తున్నాయి. ఎదిరించిన మహిళలపై సైతం కోతులు తమ ప్రతాపాం చూపుతున్నాయి. అదేవిధంగా రోడ్లపై గుంపులు గుంపులుగా చేరి పాదచారులపై కూడా దాడికి దిగుతున్నాయి. కోతుల మూక ప్రధాన రోడ్లపై సంచరిస్తుండడంతో విద్యార్థులను పాఠశాలలకు పంపించే సమయంలో తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోతుల సమస్యపై చర్యలు తీసుకోవాలని నెల రోజుల క్రితం మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇటీవల రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ హైస్కూలు ఉన్న ప్రాంగణంలోకి వానర మూక చొరబడడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు కోతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు తెలిపారు.

కొప్పుగొండుపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- అడ్డుకున్నగ్రామస్థులు
- లారీలు, మిషన్లు అధికారులకు అప్పగింత
- అయినా పట్టించుకోని అధికారులు



నడిమెట్ట వద్ద గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న దృశ్యం.



తవ్విన గ్రావెల్ గుట్ట

రాంబిల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామ సమీపంలోని నడిమెట్ట వద్ద అక్రమ గ్రావెల్ తవ్వకాలు దర్జాగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రాత్రి, పగలు తేడా లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోని వ్యవసాయ పొలాలకు రహదారి నిర్మాణం పేరుతో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. కొంత రహదారికి, మరికొంత ప్రైవేట్ వ్యక్తులకు గ్రావెల్‌ను విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొండ వద్ద గ్రావెల్ తవ్వకాలు చేపడుతుండగా రెవెన్యూ, పోలీస్, గనుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదు. దీంతో గ్రామస్థులే గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన లారీలు, మిషన్లను అధికారులకు అప్పగించినా వారు కనీసం పట్టించుకోలేదన్నారు. తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు వ్యాపారులకు సహకారాలు అందిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ సర్పంచ్ బద్ది హరిబాబు తెలిపారు.

తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలి

ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు డిమాండ్ చేశారు. నడిమెట్ట వద్ద గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న పలు ప్రదేశాలను ఆయన పరిశీలించారు. అధికార పార్టీకి చెందిన వారు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడం సరికాదన్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌కు రోడ్డు

- కొండగెడ్డ కాలువ కప్పినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భోగాపురం గ్రామస్థులు



భోగాపురంలో కొండగెడ్డ కాలువను కప్పి వేసిన గ్రావెల్ రోడ్డు

రాంబిల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురంలో అక్రమ లేఅవుట్‌కు కొండగెడ్డ కాలువను కప్పి గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కాలువను కప్పి గ్రావెల్ రోడ్డును వేస్తున్నారని వారు తెలిపారు. గ్రామంలోని పలువీధుల కాలువల్లోని మురుగునీరు, చేతిబోర్లు వద్ద గల వృథా నీరు ఈ కొండగెడ్డ కాలువ గుండా వెళుతుంది. కాలువను గ్రావెల్‌తో కప్పి వేయడంతో నీరు పారక బోర్లు వద్ద, కాలువల్లో మురుగునీరు నిలిచిపోయిందని గ్రామస్థులు తెలిపారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తులు గెడ్డ కాలువలను కప్పేస్తున్న సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

అధిష్టాన్ కార్మికులకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్



అధిష్టాన్ కార్మికులకు వేతనాలు పెంచాలని కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి):అచ్యుతాపురంలోని అధిష్టాన్ (బ్రాండిక్స్) కంపెనీలలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు.

ఈ మేరకు సీఐటీయూ, రైతుల సంఘం, ఐద్వా నాయకులతో తమ కార్యాలయం వద్ద ఆదివారం వేతనాల పెంపుపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. గత మూడు రోజులుగా తమ వేతనాలు పెంచాలని మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళనకు తాము పూర్తి మద్దతు ఇచ్చామన్నారు. టార్గెట్‌ల పేరుతో శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులకు వేతనాలను 2015 నుంచి సవరించకపోవడంతో తక్కువ జీతాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస వేతనాల జీవోను సవరించి కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, ఎన్.బ్రహ్మాజీ, ఐద్వా నాయకులు సీహెచ్.మంగతాయారు, ఆర్. లక్ష్మి, మత్స్యకార్మిక సంఘం నాయకులు చేపల తాతయ్య పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి



మృతి చెందిన రమణ

నక్కపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనబాలవానిపాలెం గ్రామ సమీపంలోని చెరువులో అదే గ్రామానికి చెందిన గొర్ల రమణ (42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ పడి మరణించినట్టు సీఐ కె.కుమారస్వామి ఆదివారం చెప్పారు. గత నెల 31న రమణ ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. గ్రామానికి సమీపంలో చర్చి వెనుక వున్న చెరువులో అతని మృతదేహం ఆదివారం లభ్యమైంది. అతని భార్య నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కుమారస్వామి చెప్పారు.

జనసేనలో చేరిన అప్పన్నపాలెం వైసీపీ నేతలు



జనసేనలో చేరిన వైసీపీ నేతలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 2, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలాపల్లి పంచాయతీ అప్పన్నపాలెం గ్రామ వైసీపీ నాయకులు జనసేన పార్టీలోకి చేరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద జనసేన నాయకుడు పైల రామునాయుడు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన వార్డు సభ్యులు పైల తాతబాబు, తమరాన నాయుడు, రెడ్డి నాయుడు, వారి అనుచరులు పైల రమణ, నానిబాబు, అప్పారావు, శ్రీరాములు, ధర్మశ్రీను తదితరులు పార్టీలో చేరారు. వీరందరినీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి రామదాసు, నాయకులు రవి, లాలం శ్రీను, పవన్ నూకరాజు, శేషు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో ఘనంగా దివ్య స్వర్ణిమ రథోత్సవం

మునగపాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాల యం ఆధ్వర్యంలో ఆదివారం దివ్య స్వర్ణిమ రథోత్సవం గ్రామంగా ఘనం గా నిర్వహించారు. మునగపాక వచ్చిన దివ్య స్వర్ణిమ రథోత్సవానికి స్థానిక ఓం శాంతి నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఊరేగింపులో మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రథంలో కొలువైన శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. మందిరం నిర్వాహకురాలు శ్యామల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో ఎంపీపీ మళ్ల జయమ్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

ఐదేళ్ల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

... 5వ పేజీ తరువాయి

పనులు సక్రమంగానే సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాల మాదిరిగానే నీటిపారుదల రంగాన్ని కూడా గాలికొదిలేసింది. కాలువల్లో పూడిక పేరుకుపోయింది. తుప్పలు పెరిగిపోయాయి. తూముల గేట్లు తుప్పు పట్టడంతో పైకి ఎత్తడానికి, కిందకు దించడానికి వీలు కావడంలేదు. దీనికితోడు తూముల పక్కన, రిజర్వాయర్ గట్టుకు పలుచోట్ల రంధ్రాలు పడ్డాయి. దీంతో రిజర్వాయర్ నుంచి నీరు వృథాగా పోతున్నది. ఈ సమస్యలను అధికారులు, వైసీపీ ప్రజాప్రతి నిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నందున కామునిగెడ్డ రిజర్వాయర్ సమస్యలను స్థానిక (చోడవరం) ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తీర్చాలని కోరుతున్నారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీకి నేడు నోటిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఇతర అధికారులు అందుబాటులో ఉంటారు.

ఓటు కోసం మరో 1,300 దరఖాస్తులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో 1,300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గతనెల 31వ తేదీ చివర రోజు కావడంతో అప్పటివరకు వచ్చిన ఈ దరఖాస్తులను విచారించేందుకు వీలుగా సంబంధిత జిల్లాలకు పంపారు. కాగా ఈనెల పదో తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న 21,555 మంది ఓటర్లకు వీరు అదనం.

చేపల వేట నిషేధ భృతికి నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

దీనిపై దృష్టి సారించలేదు. అనకాపల్లి జిల్లా పరిధిలో 27 మత్స్యకార గ్రామాల్లో 2,168 మంది మత్స్యకారులు చేపల వేట నిషేధ భృతికి అర్హులను గత ఏడాది ఏప్రిల్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. పూడిమడకలో 328 బోట్లు, బంగారమ్మపాలెంలో 209, రాజయ్యపేట, బోయపాలెంలలో 209, రేవుపోలవరంలో 168, ముత్యాలమ్మపాలెంలో 125, వెంకటనగరం, రాజానగరంలలో 137, కొత్తపట్నంలో 111 బోట్లకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలి. ఇంకా వాడనర్సాపురంలో 99 మంది, పాల్మన్‌పేటలో 89, కొర్లయ్యపాలెంలో 77, బంగారమ్మపాలెంలో 79, డీఎల్ పురంలో 68, గజపతినగరంలో 63, పెదతీనార్లలో 46 మంది మత్స్యకారులకు కూడా భృతి అందాల్సి వుంది. మొత్తం రూ.2.16 కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉందని మత్స్యకార నేతలు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు సముద్రంలో ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపాన్ల ప్రభావంతో రోజుల తరబడి చేపల వేటకు వెళ్లలేకపోయామని, దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. మరో రెండున్నర నెలల్లో చేపల వేటపై నిషేధం అమల్లోకి వస్తుందని, గత ఏడాది నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారం సొమ్మును కనీసం ఇప్పటికైనా విడుదల చేయాలని కోరుతున్నారు. అంతేకాక గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది చేపల వేటపై నిషేధ కాలంలో ఒక్కో మత్స్యకారునికి రూ.20 వేల చొప్పున భృతి అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌లు కబ్జా!

... 5వ పేజీ తరువాయి

అన్ని రకాల వాహనాలు పెరగడంతో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఈ సమస్యను నిత్యం గమనిస్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం

బి.వెంకటరమణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్



పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. దుకాణాల యజమానులతో అతిత్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించే ందుకు చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్‌లపై పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టిన వారి పై కేసులు పెడతాం.

జీవీఎంసీ పార్కు గోడ కూల్చివేత!

ఒక్క రోజు ఉత్సవానికి గోడ తొలగించడం సరికాదని స్థానికుల ఆగ్రహం

పార్కు గోడ తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్

అనకాపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం పేరుతో జీవీఎంసీ ఆధీనంలో ఉన్న వుడా పరమేశ్వరి పార్కు గోడను కూల్చివేశారు. ఒక్క రోజు ఉత్సవం కోసం గోడ కూల్చివేయడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. తక్షణమే గోడను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లిలోని గౌరపాలెంలో స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఈ పార్కు ఇక్కడ కొనసాగుతోంది. ఈ ప్రాంతాన్ని స్థానికులు పార్కు సెంటరుగా పిలుస్తున్నారు. ఈ పార్కు ప్రస్తుతం జీవీఎంసీ అధికారుల సంరక్షణలో ఉంది. పరిసరాల్లో నివాసం ఉంటున్న చాలా మంది ప్రతి రోజూ సాయంత్రం, ఉదయం వేళల్లో పార్కులో సేదతీరుతుంటారు. పార్కు సెంటరులో గత నెల 25న గౌరీపరమేశ్వరుల సంబరం నిర్వహించారు. ఈ క్రమంలో గౌరీ గ్రంథాలయంవీధికి ఎదురుగా ఉన్న వుడా పరమేశ్వరి పార్కు గోడను కళాప్రదర్శన వేదికకు అడ్డువస్తుందనే నెపంతో గత నెల 24న కూల్చేశారు. వాస్తవానికి జీవీఎంసీకి చెందిన పార్కు గోడను తొలగించాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాని ఎటువంటి అనుమతులు పొందకుండా, పెద్దలతో సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయంతో గోడను కూల్చివేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం మొక్కుబడిగా ఒక గేటు పెట్టి వదిలేశారు. దీనివల్ల విశ్రాంతి కోసం పార్కుకు వచ్చేవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు..

ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు

జీవీఎంసీ పార్కు గోడ కూల్చివేత పనులు జరుగుతుండగా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. దశాబ్దాలుగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరుగుతున్నాయని, ఒక్క రోజు పండగ కోసం పార్కు గోడ ఎలా అడ్డు వచ్చిందో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకొని పార్కు గోడను పునర్నిర్మించేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పరమేశ్వరి పార్కు ముఖ ద్వారం


ఉత్సవాల కోసం గోడ తొలగించి వదిలేసిన దృశ్యం

గోడ తొలగింపునకు అనుమతి ఇవ్వలేదు

-జీవీ రమణ, జోనల్ కమిషనర్

పార్కు గోడ తొలగింపునకు జీవీఎంసీ నుంచి ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. స్థానిక ప్రజలల ఫిర్యాదు మేరకు గోడ తొలగించిన పార్కు స్థలాన్ని పరిశీలిస్తాం. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు చేపడతాం.

తొక్కిసలాట జరగకూడదనే తొలగించాం

-సంతోశ్, ఉత్సవ కమిటీ చైర్మన్

ఈసారి ఉత్సవాలకు జనాభా ఎక్కువగా వస్తారనే ఉద్దేశంతో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గోడ తొలగించాం. ఇందుకోసం పోలీసులు అనుమతి తీసుకున్నామని, జీవీఎంసీ అధికారుల అనుమతి పొందలేదని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది ఉత్సవాల సందర్భంగా పార్కు గోడ తొలగించకుండా గోడ తొలగించిన చోట గేటు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.



పరవాడలో వరి నాట్లు వేసేందుకు వరి ఆకు తీస్తున్న రైతులు

పరవాడ వరి నాట్లు వేసిన దృశ్యం

ముమ్మరంగా రబీ వరి నాట్లు

▸▸ పొలాల్లో బిజీగా రైతులు

పరవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రబీ సీజన్ వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులంతా పొలాల్లో బిజీగా గడుపుతున్నారు. ఈ ఏడాదివర్షాలు విస్తారంగా కురవడంతో సాగునీటి చెరువులన్నీ కళకళలాడుతున్నాయి. వరి పంటకు అవసరమైన నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు రబీ వరి పంటపై దృష్టిసారించారు. మండల వ్యాప్తంగా సుమారు 330 ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు మడులను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు 110 ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మిగతా నాట్లు కూడా ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేస్తారన్నారు. ఇప్పటి వరకు రావాడ పంచాయతీలో నాట్లు పూర్తి చేశారు. అలాగే పరవాడ, కలపాక, స్వయంభూవరంలలో పనులు కొనసాగుతున్నాయి.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న పీలా గోవింద్

కశింకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోటలో అభయాంజనేయస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

దేవీపురంలో వారాహి సహిత చండీ హోమం


వారాహి సహిత చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సబ్బవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురంలో రాజరాజేశ్వరీ సహస్ర అమ్మవారి పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వారాహి సహిత చండీ హోమం ఘనంగా నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ముందుగా గోమాత పూజ, అభిషేకం, శోడషోపచార పూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమ, ప్రభాకర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

సబ్బవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మీ మాట్లాడుతూ.. మడ అడవులు ప్రకృతికి, జీవ వైవిధ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక అడవుల పెంపకం, వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. 1971 నుంచి అంతర్జాతీయ వెట్‌ల్యాండ్ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ఎం.రత్నప్రకాశ్, ఎన్ఎస్ఎస్ పీవో గణేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల స్టడీ పర్యవేక్షణ


పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి స్టడీపై ఆరా తీస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకి ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి. అప్పారావు వెళ్లి పర్యవేక్షించారు. ఇళ్ల వద్ద ఉండి ప్రతి ఒక్క విద్యార్థీ మంచి ఉత్తీర్ణత సాధించి శతశాతం మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. హైస్కూలులో 100 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని వీరందరినీ ప్రత్యేకంగా చదివించి అధిక శాతం మార్కులు వచ్చే విధంగా పలు సూచనలు చేస్తున్నామని ఆయన చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సాహం కూడా ఈ సమయంలో మరింత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ప్రభుత్వ హైస్కూల్లో 1976-77 బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 1976-77లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అడ్డూరు సమీపంలోని మామడి తోటలో 48 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను మరొక్కరు అడిగి తెలుసుకన్నారు. కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యా, ఇతర వివరాలను తెలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా, పాత రోజులు తలచుకుంటూ కేరింతలు కొడుతూ రోజుంతా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తిబోజనం చేసారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ వెంకటరమణ, యాజీ నారాయణ, బోకం పైడితల్లి, రొంగలి శంకకరావు, గెడ్డం దుర్గారావు, యడ్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పసలమ్మతల్లి తీర్థ మహోత్సవం

సబ్బవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద పస లమ్మతల్లి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్ని పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన చిడతల బజనలు, కోలాటం, నేల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గండి రవికుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నరసింగరావు, ఎంపీటీసీ సభ్యుడు కర్రి అప్పారావు, ఆర్ఈసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, స్థానిక నేతలు పీబీవీఎస్ఎన్ రాజు, ఇందలి రమణ, కర్రి కనకరాజు, కరణం రామునాయుడు, గవర అప్పారావు, గవర సత్తిబాబు, ఈపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


సున్నింబట్టీలు వద్ద పసలమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కార్మికుల ధర్నా

కశింకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు ఆదివారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, టి.అప్పారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాడ్‌చేశారు. 2019 వరకు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా ఎలక్ట్రీషియన్, ప్లంబర్, తాపీమేస్త్రి తదితర కార్మికుల వివాహాలకు, ప్రమాదాలకు గురైన వారికి సంక్షేమ బోర్డు నుంచి ఆర్థిక సహాయం అందేదన్నారు. తరువాత వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వం లేబర్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు క్లియర్ చేసి పథకాన్ని కొనసాగించాలని వారు కోరారు. అలాగే 20 ఏళ్ల క్రితం ఉన్న ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెరిగిన సిమెంటు, ఐరన్ తదితర భవన నిర్మాణానికి అవసరమైన వస్తువుల ధరలు తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.గోవింద, ఎన్. శ్రీను, ఎస్. నూకరాజు, శేషు, అప్పలరాజు, బి.శేషు, దుర్గన్న, నాగేశ్వరరావు, చిన్న నాగేశ్వరరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు


షిర్డిసాయిబాబాకు పూజలు, హోమం నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన షిర్డీసాయి సేవా ట్రస్టు వార్షికోత్సవాలు

ముగింపు వేడుకలకు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

పరవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌతు లచ్చన్ననగర్‌లోని రెండు రోజులు పాటు నిర్వహించిన షిర్డీసాయి సేవా ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. వేడుకలకు పరవాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీ పూర్ణచంద్రరావు నేతృత్వంలో షిర్డీసాయికి పాదుకల రూపంలో అభిషేకం, షోడశోపచార పూజ, సామూహిక జగద్గురు సాయి పారాయణ నిర్వహించారు. అలాగే భక్తులకు అల్పాహారం విందును ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తుల కోసం ఆధ్యాత్మిక ప్రవచనములు గూర్చి వివరించారు. భక్తిగీతాలు, భజనలు చేపట్టారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు రాకతో శ్రీ సద్గురు పాదకా క్షేత్రం కిక్కిరిసింది.

కారు, బైక్ ఢీ: యువతి మృతి

▸▸ మృతురాలి స్వస్థలం దేవరాపల్లి


రొంగలి లీల (ఫైల్)

భోగాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన రొంగలి లీల (23) మృతి చెందింది. ఈ ప్రమాదంలో పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన అడపాక శివగణేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకారం మండలంలోని ముంజేరు సమీపంలో సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్న ఆరుగురు స్నేహితులు ఆదివారం రాత్రి మూడు ద్విచక్రవాహనాలపై శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే జాతీయరహదారిపై తగరపువలస వైపు వెళ్తున్నారు. అయితే పోలిపల్లి, అవనం జంక్షన్ మధ్య జాతీయ రహదారిపైకి వచ్చే సరికి అదే రహదారిలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఒక ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న రొంగలి లీల రోడ్డుపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో ఎ.శివగణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. లీల రెండేళ్ల నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తోంది. ఆమెకు రొంగలి లక్ష్మి, పెద్దినాయుడు తల్లిదండ్రులతో పాటు చెల్లెలు ఉంది. మృతురాలు తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనపై సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేశారు.

బైక్‌ను కారు ఢీకొని యువకుడి మృతి

▸▸ మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


రాము (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండల అగ్రహారం గ్రామానికి చెందిన మూకల రాము (24) ద్విచక్ర వాహనంపై అతని భార్య, మేనకోడలుతో కలిసి నర్సీపట్నం నుంచి కొండలఅగ్రహారం వస్తున్నాడు. దాలింపేట గ్రామానికి వచ్చేసరికి ఎదురుగా తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వస్తున్న కారు అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాము తలకు బలమైన గాయం తగిలింది. అలాగే అతని భార్య భవానీ, మేనకూడలు రీతు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని 108లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాము చికిత్స పొందుతూ మృతి చెందగా, గాయపడిన ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధింఇ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. కాగా, ఆదివారం నుంచి కొండలఅగ్రహారం గ్రామంలో గౌరీపరమేశ్వర జాతర ఉంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రాము మృతి చెందడం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉపాధ్యాయురాలి మృతి

▸▸ కుంభమేళా నుంచి తిరిగివస్తూ ప్రమాదానికి గురైన కారు

పూసపాటిరేగ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని కనిమెట్టలో జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బి.సౌజన్య దుర్మరణం చెందారు. మృతురాలు భోగాపురం మండలంలోని పోలిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖలో నివాసం ఉంటున్న సౌజన్య.. భర్త కింగువ రవికుమార్, ఇద్దరు పిల్లలు, అత్త భోగి భవానీతో గతనెల 27న కారులో కుంభమేళాకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆదివారం తెల్లవారుజామున కనిమెట్ట వద్ద విశాఖ వైపు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. దాంతో డ్రైవర్ వెనుకవైపు కూర్చొన్న సౌజన్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. డ్రైవర్, భవానీలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంపై జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

మామపై అల్లుడు దాడి

పెందుర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో జరిగిన వేడుకకు తనను ఆహ్వానించలేదన్న ఆగ్రహంతో మామపై అల్లుడు దాడికి పాల్పడిన ఘటన వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెంలో చోటుచేసుకుంది. సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు చెందిన నక్క శ్రీనివాసరావు(33)కు, అప్పన్నపాలెంకు చెందిన దేవాడపు జోగారావు (50) కుమార్తెతో వివాహమైంది. కొంతకాలంగా మామ, అల్లుడు మధ్య కుటుంబపరమైన వివాదాలున్నాయి. ఈ క్రమంలో శనివారం మామయ్య కుటుంబంలో జరిగిన వేడుకకు శ్రీనివాసరావును ఆహ్వానించలేదు. దీంతో ఆదే రోజు రాత్రి మామయ్య జోగారావును శ్రీనివాసరావు నిలదీసి తగువు పెట్టాడు. అప్పటికే మద్యం తాగిన మైకంలో ఉన్న అల్లుడు కత్తితో మామను గాయపరిచాడు. అతను గాయపడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ

కొత్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో బీహార్‌కు వరాల జల్లు కురిపించిన కేంద్రం, ఏపీ మాత్రం మొండి చేయి చూపిందని ఆరోపించారు. ఏపీపై కేంద్రం చిన్నచూపు చూడడం తగదన్నారు. పెట్టుబడిదారులకు మేలు చేకూర్చే విధంగా బడ్జెట్ ఉందన్నారు. 21 మంది ఎంపీలు ఉన్నా ఏపీకి ప్రాధాన్యత దక్కపోవడం విచారకరమన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

సబ్బవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ నాయకులు జి.సామ్రాట్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సామాన్యులు, రైతులు, ఉద్యోగులకు సైతం ఈ బడ్జెట్ ఊరటనిస్తుందన్నారు. ఏపీ జీవనాడి పోలవరానికి రూ.5,936 కోట్లు కేటాయించడం హర్షనీయమని పేర్కొన్నారు. నిధుల కేటాయింపులో సీఎం చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి ఫలించందన్నారు.

'అసంఘటిత రంగాన్ని నిరుత్సాహపరిచిన కేంద్ర బడ్జెట్'

తుమ్మపాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అసంఘటిత రంగాన్ని తీవ్రంగా నిరుత్సాహపరిచిందని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పలు వర్గాలకు ఈ బడ్జెట్ ఎలాంటి ఉపశమనం కలిగించలేదన్నారు. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఆర్థిక దివాళ కోరు విధానాలతో దేశం అట్టడుగు స్థానానికి దిగజారిపోతుందని ఆరోపించారు.

'రైతులను నిర్లక్ష్యం చేసిన బడ్జెట్'

తుమ్మపాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరినాథబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. కేంద్ర ఆర్థిక మంత్రికి విమానాశ్రయాల నిర్మాణం పై ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేకపోవడం దారుణమన్నారు. ఎన్నిసార్లు బడ్జెట్ సమావేశాలు జరిగినా ధనవంతులను మరింత ధనవంతులను చేసేలా బడ్జెట్ రూపకల్పన జరుగుతుందే తప్ప సామాన్యులకు ఎలాంటి ఊరట కలగటం లేదన్నారు. రైతులకు రైలు, బస్ ప్రయాణాల్లో 50 శాతం రాయితీలు కల్పించాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 30 శాతం సీట్లను రైతులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీతారాముల పరస

లంకెలపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెదముషివాడ శివారు పచ్చికోరువానిపాలెం రామాలయం వద్ద ఆదివారం సీతారాముల పరస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు సీతారాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కొలాటాలు, తప్పెడ గుళ్ల, సాము గరిడీలు, బొమ్మల కొలువు, డాన్స్ బేబీ డాన్స్ వంటి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంత గ్రామాల నుంచి ప్రజలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేసింది.

వెంకటలక్ష్మికి తెలుగు వెలుగు మహానంది పురస్కారం


వెంకటలక్ష్మికి పురస్కారం అందిస్తున్న దృశ్యం

లంకెలపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన పంచికోరు వెంకటలక్ష్మి తెలుగు వెలుగు నంది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. కోలాట కళా రంగంలో విశిష్ట సేవలను అందిస్తున్న వెంకటలక్ష్మిని గుర్తించి పురస్కారం అందజేయడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరకు ఉత్సవ్ అదరహో

» సందడిగా ముగిసిన వేడుకలు » ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అరకు ఉత్సవాలు ఆద్యంతం అలరించాయి. మూడురోజులపాటు సందడి నెలకొంది. హెలికాప్టర్‌జోయ్‌రైడ్, ఫ్లవర్ షో, సుంకరమెట్టు కాఫీతోటల నుంచి ట్రెక్కింగ్, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా సాగింది.

-అరకు/ఆంధ్రజ్యోతి



పాటలు పాడుతున్న ప్రముఖ గాయని మంగ్లీ



నృత్య ప్రదర్శనలో ఆదివాసీ కళాకారులు



ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతి అందిస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

బీజేపీ బలోపేతానికి కృషి

» పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన శాంతకుమారి



జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన శాంతకుమారి

పాడేరురూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి తెలిపారు. ఆదివారం ఆమె జిల్లా రిటర్నింగ్ ఆఫీసర్ పుట్టా గంగయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు సమక్షంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో పర్యటించి మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ముంచంగిపుట్టుకు పి.రాజారావు, పెదబయలుకు ఎస్.వేమన బాబు, హుకుంపేటకు జె.చినతల్లి, డుంబ్రిగుడకు ఎం.గోపాలపాత్రుడు, అనంతగిరికి వి.దేవదాస్, అరకులోయకు బి.మూర్తి, పాడేరుకు పి.రవికుమార్, జి.మాడుగులకు ఎల్.అబ్బాయిదొర, చింతపల్లికి సల్లా రామకృష్ణ, జీకేవీధికి ఎస్.ఉమామహేశ్, కొయ్యూరుకు కె.కృష్ణారావులను మండల ఇన్‌చార్జులుగా ప్రకటించారు. అనంతరం ఆమెను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు

మోదకొండమ్మకు వెండి పాదాలు బహూకరణ



మోదకొండమ్మవారికి వెండి పాదాలను సమర్పిస్తున్న భక్తుడు వాసు

పాడేరురూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని మోదకొండమ్మకు విశాఖలోని గాజువాకకు చెందిన బి.వాసు కిలో వెండితో తయారు చేసిన అమ్మవారి పాదాలను బహూకరించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పాదాలను ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శాస్త్రి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడుకు అమ్మవారి సన్నిధిలో అందించారు. అమ్మవారికి వెండి పాదాలను వితరణ చేసిన వాసు దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో మొక్కుకున్న మేరకు ఈ పాదాలను అమ్మవారికి బహూకరించినట్టు ఆయన తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అరకు చలి ఉత్సవ్, మండలంలోని వంజంగి ప్రాంతాన్ని తిలకించేందుకు పర్యాటకులు అమ్మవారి దర్శనానికి వ చ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యం శాస్త్రి పూజలను నిర్వహించారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మిత్రులు, కుటుంబ సభ్యులతో సాయంత్రం వరకు గడపటంతో ఆలయం భక్తులతో కళకళలాడింది. భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి ప్రసాదం, మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని అందించారు.

చౌడపల్లిలో గొట్టి పండుగ



థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

చింతపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆదివాసీలు గిరిజన సంప్రదాయబద్ధంగా గొట్టిపండుగను జరుపుకున్నారు. ఏటా సంక్రాంతి అనంతరం ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం గ్రామస్థులంతా కలిసి ఈ వేడుకను నిర్వహించారు. గిరిజనుల ఆచారాలు, కట్టుబాట్లు, పండుగలపై పెద్దలు గ్రామంలో యువతకు వివరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. థింసా నృత్యాన్ని చిన్నపెద్ద తారతమ్యంలేకుండా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కంటా వెంకట రమణ, కో రాబు కరుణానిధి, వసుపరి చిన్నారావు, యూవీగిరి, దేపూరి శశికుమార్, సరమండ తిలక్ పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఉన్న జోలాపుట్టు జలాశయంలోని శనివారం నాటు పడవ మునిగి ఇద్దరు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నుంచి ఒడిశా అధికారులు విద్యార్థులు ఆచూకీకోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఓడీఆర్ఎఫ్ బృందాలు రంగంలోని దిగి, ఉదయం ఆరు గంటల నుంచి సాయింత్రం ఆరు వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. జలాశయంలో అట్టడుగున రాళ్ల ఉండడంతో వాటిలో చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముంచంగిపుట్టు, లమ్‌తాపుట్టు, తహసీల్దార్లు నర్సమ్మ, ప్రతిభజ్యోతి, ఆర్‌ఐ రవికుమార్ ఈ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఘనంగా శంకులమ్మ తల్లి తీర్థ మహోత్సవం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల ఆరాధ్య దైవం శంకులమ్మ తల్లి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని గుడివాడలో ఘనంగా నిర్వహించారు. ఈ అమ్మవారిని సాక్షాత్తు లక్ష్మీదేవి రూపంగా భావించి ప్రతి గ్రామంలో గిరిజనులు పూజలు చేస్తారు. పొలాల్లో విత్తనాలు చల్లిననాటిన నుంచి పంటలు ఇంటికి తీసుకువచ్చేంత వరకు విధిగా శంకులమ్మ తల్లిని ఆరాధిస్తుంటారు. అష్టలక్ష్మి స్వరూపంలో ఒకటైన సంతాన లక్ష్మిగా శంకులమ్మను భావిస్తారు. అందుకే వివాహం అయిన వెంటనే వధూవరులను తల్లిసన్నిధికి తీసుకు వచ్చి మొక్కులు తీర్చిన అనంతరం ఇంటిలో అడుగుపెట్టించడం నేటికీ ఆనవాయితీగా కొనసాగుతోంది. గుడివాడ సావిడిలో ఉన్న శంకులమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలను చేపట్టారు. అమ్మవారి



అమ్మవారు



పురవీధుల్లో శంకులమ్మ తల్లిని భారీగా ఊరేగిస్తున్న భక్తులు

దర్శనానికి మహిళలు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని పట్టణ పురవీధుల్లో భారీగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సమర్పించే సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వర్తన పిన్నయ్యదొర, గంగపూజారి శివకుమార్, వర్తన శ్రీనుబాబు, కొట్టగుళ్లి గణేష్ కుమార్, బోనంగి రమణ, కొట్టగుళ్లి రామారావు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘భూ బదలాయింపు చట్టం జోలికివస్తే సహించం’



చౌడుపల్లిలో ఆందోళన చేస్తున్న పెసా కమిటీ నాయకులు, గ్రామపెద్దలు

చింతపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు చట్టం జోలికి వస్తే సహించేది లేదని చౌడుపల్లి పంచాయతీ పెసా కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ లలిత కుమారి హెచ్చరించారు. ఆదివారం చౌడుపల్లిలో శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ ఐదో షెడ్యూల్డ్ ప్రాంతమైన గిరిజన ప్రాంతంలో ఆదివాసీల భూములకు రక్షణ కల్పిస్తూ భూ బదలాయింపు చట్టాన్ని తీసుకువచ్చినట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని పటిష్టం చేసేందుకు కృషి చేస్తుంటే అయ్యన్నపాత్రుడు సవరించాలని వ్యాఖ్యా నించడంబాధాకరమన్నారు.గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆయన మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సామాజిక వైద్యుల సంఘ సభ్యులు

అనంతగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు వద్ద ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం క్యాన్సర్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు జంగం జోషి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే సందర్భంగా పర్యాటక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. నరేశ్, హరి, తదితరులు పాల్గొన్నారు.



దోనుగుమ్ముల జలపాతంలో సందడి చేస్తున్న పర్యాటకులు

జాలువారే సోయగం.. అభివృద్ధికి దూరం

» దోనుగుమ్ముల జలపాతం సందర్శకుల తాకిడి
» కనీస వసతులు ఇబ్బందులు » మట్టి రోడ్డే మార్గం
» పట్టించుకోని అధికార యంత్రాంగం

చుట్టూ పచ్చదనం.. మంచుతెరల మాటున గిరులు.. దివినించి దిగేలా జలపాతం.. ఉరకలెత్తే పరవళ్లు.. దవళవర్ణంలో జలతారు నీటి ధార.. ప్రకృతి కేన్వాసుపై రంగులద్దినట్టు .. భువిలో అద్భుతం.. దోనుమ్ముల జలపాతం. ఇక్కడి సోయగాలు పకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. జలపాతం వద్ద సౌకర్యాలు కల్పిస్తే పర్యాటకులను మరింత ఆకట్టుకుంటుంది.


గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుగుమ్ముల జలపాతం అభివృద్ధికి నోచుకోకపోవడంతో సందర్శకులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఇక్కడికి చేరుకోవడానికి కాలిబాటమినహా ర హదారి సౌకర్యం లేదు. ఈ జలపాతం వద్దకు వీకెండ్ రోజుల్లో వందల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ఇక్కడ కనీస సదుపాయాలు కల్పిస్తే పర్యాటకులు మరింతగా సందర్శించే వీలుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ జలపాతాన్ని 2015లో ‘ఆంధ్రజ్యోతి’ తొలిసారిగా బాహ్యప్రపంచానికి పరిచయం చేసింది. నాటి నుంచి పర్యాటకులు సందర్శిస్తున్నారు. గత రెండేళ్లగా సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ప్రస్తుతం శని, ఆది, సోమవారాల్లో వందల సంఖ్యలో పర్యాటకులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. కార్తీకమాసంలో వేల సంఖ్యలో పర్యాటకులు జలపాతాన్ని సందర్శిస్తున్నారు.

జలపాతానికి ఎలావెళ్లాలంటే..

చింతపల్లి- సీలేరు ప్రధాన రహదారిలో జీకేవీధి తరువాత వచ్చే సంపంగిగొంది గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు కాలినడక వెళితే దోనుగుమ్ముల జలపాతం వస్తుంది. గతంలో కాఫీతోట మధ్యలో నుంచి కాలిబాటపై నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. పర్యాటకులు పెద్ద సంఖ్యలో జలపాతాన్ని సందర్శిస్తుండడంతో దోనుగుమ్ముల గిరిజనులు వాహనాలు వెళ్లే మార్గాన్ని శ్రమదానంతో నిర్మించారు. దీంతో ప్రస్తుతం జలపాతం సమీపం వరకు ద్విచక్రవాహనాలు, జీపులు, కార్లు వెళుతున్నాయి. అరకిలోమీటరు దూరంలో వాహనాలు నిలిపివేసి జలపాతం వద్దకు నడచి వెళ్లాలి.

ప్రత్యేకతలు ఇవీ..

ఈ జలపాతానికి ప్రత్యేక విశిష్టత ఉన్నది. సుమారు 200 అడుగుల ఎత్తులోనుంచి దిగువకు నీరు ప్రవహిస్తుంది. జలపాతం నీటి ప్రవాహం మూడు స్టెప్స్‌లో జాలువారుతుంది. ఇక్కడి బండరాయి ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీంతో పర్యాటకులు ఈజలపాతంలో స్నానాలు చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు.



జాలువారుతున్న నీటిపాయలు

కనీస సౌకర్యాలు కల్పిస్తే..

జలపాతానికి వద్ద పర్యాటకశాఖగాని, ఐటీడీఏగాని కనీస సదుపాయాలు కల్పిస్తే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది. ప్రస్తుతం గ్రామస్తులు నిర్వహించిన మట్టిరోడ్డును కనీసం మెటల్ రోడ్డుగానైనా మార్చితే వాహనాల ప్రయాణానికి కలిగే ఇబ్బందులు తొలుగుతాయి. భవిష్యత్తులో తారురోడ్డు నిర్మిస్తే బాగుంటోంది. జలపాతంలో పర్యాటకులు సందర్శించేందుకు అనువుగా కొత్తపల్లిమాదిరిగా మెట్లు ఏర్పాటుచేయాలి. జలపాతం వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు , తాగేందుకు మంచినీటి సౌకర్యం కల్పించాలి. సీజన్‌లో పెద్ద సంఖ్యలోపర్యాటకులు వనభోజనాలు చేసేందుకు జలపాతానికి వస్తుండడంతో కమ్యూనిటీ భవనం నిర్మిస్తే బాగుంటుంది.

రోజూ పర్యాటకులు వస్తుంటారు



జలపాతానికీ పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. శని, ఆదివారాల్లో జలపాతం పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటోంది. మిగిలిన రోజుల్లోనూ తక్కువగానున్నప్పటికీ ప్రతీరోజు జలపాతాన్ని సందర్శించేవారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా రహదారి, పర్యాటకుల కోసం మంచినీరు, మరుగుదొడ్లు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతోంది.

- కొర్ర సునీల్, దోనుగుమ్ముల గ్రామం

ఐదేళ్ల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

... 5వ పేజీ తరువాయి

పనులు సక్రమంగానే సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాల మాదిరిగానే నీటిపారుదల రంగాన్ని కూడా గాలికొదిలేసింది. కాలువల్లో పూడిక పేరుకుపోయింది. తుప్పలు పెరిగిపోయాయి. తూముల గేట్లు తుప్పు పట్టడంతో పైకి ఎత్తడానికి, కిందకు దించడానికి వీలు కావడంలేదు. దీనికితోడు తూముల పక్కన, రిజర్వాయర్ గట్టుకు పలుచోట్ల రంధ్రాలు పడ్డాయి. దీంతో రిజర్వాయర్ నుంచి నీరు వృథాగా పోతున్నది. ఈ సమస్యలను అధికారులు, వైసీపీ ప్రజాప్రతి నిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకో లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నందున కామునిగెడ్డ రిజర్వాయర్ సమస్యలను స్థానిక (చోడవరం) ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తీర్చాలని కోరుతున్నారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీకి నేడు నోటిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, ఇతర అధికారులు అందుబాటులో ఉంటారు.

ఓటు కోసం మరో 1,300 దరఖాస్తులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో 1,300 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గతనెల 31వ తేదీ చివర రోజు కావడంతో అప్పటివరకు వచ్చిన ఈ దరఖాస్తులను విచారించేందుకు వీలుగా సంబంధిత జిల్లాలకు పంపారు. కాగా ఈనెల పదో తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న 21,555 మంది ఓటర్లకు వీరు అదనం.

చేపల వేట నిషేధ భృతికి నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

దీనిపై దృష్టి సారించలేదు. అనకాపల్లి జిల్లా పరిధిలో 27 మత్స్యకార గ్రామాల్లో 2,168 మంది మత్స్యకారులు చేపల వేట నిషేధ భృతికి అర్హులను గత ఏడాది ఏప్రిల్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. పూడిమడకలో 328 బోట్లు, బంగారమ్మ పాలెంలో 209, రాజయ్యపేట, బోయపాలెంలలో 209, రేవుపోలవరంలో 168, ముత్యాలమ్మపాలెంలో 125, వెంకటనగరం, రాజానగరంలలో 137, కొత్తపట్నంలో 111 బోట్లకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలి. ఇంకా వాడనర్సాపురంలో 99 మంది, పాల్మన్‌పేటలో 89, కొర్లయ్యపాలెంలో 77, బంగారమ్మపాలెంలో 79, డీఎల్ పురంలో 68, గజపతినగరంలో 63, పెదతీనార్లలో 46 మంది మత్స్యకారులకు కూడా భృతి అందాల్సి వుంది. మొత్తం రూ.2.16 కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉందని మత్స్యకార నేతలు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు సముద్రంలో ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్ల ప్రభావంతో రోజుల తరబడి చేపల వేటకు వెళ్లలేకపోయామని, దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. మరో రెండున్నర నెలల్లో చేపల వేటపై నిషేధం అమల్లోకి వస్తుందని, గత ఏడాది నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారం సొమ్మును కనీసం ఇప్పటికైనా విడుదల చేయాలని కోరుతున్నారు. అంతేకాక గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది చేపల వేటపై నిషేధ కాలంలో ఒక్కో మత్స్యకారునికి రూ.20 వేల చొప్పున భృతి అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌లు కబ్జా!

... 5వ పేజీ తరువాయి

అన్ని రకాల వాహనాలు పెరగడంతో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభిస్తున్నది. ఈ సమస్యను నిత్యం గమనిస్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం

-బి.వెంకటరమణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్



పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. దుకాణాల యజమానులతో అతిత్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించే ందుకు చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్‌లపై పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టిన వారి పై కేసులు పెడతాం.

7న అడవిరాజుబాబుల పండగ

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఈ నెల 7వ తేదీ అడవిరాజుబాబుల పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు తెలిపారు. స్థానిక అల్లూరిసీతారామరాజు పార్కు సమీపంలో బొడ్డేరు వంతెన వద్ద నిర్మించిన ఆలయంలో ఏటా ఈ పండగను చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆలయానికి విద్యుత్ అలంకరణతో పాటు పండగ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పండగకు కొయ్యూరు, గొలుగొండ, నాతవరం, చింతపల్లి తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

8న రామాలయ ప్రారంభోత్సవం

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లచ్చన్నపాలెం గ్రామంలో ఈ నెల 8వ తేదీన రామాలయం ప్రారంభిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నాయకుడు పోతల రాంబాబు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రామాలయం పూర్తిచేశామన్నారు. 8న సీతారాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ పోతల రామలక్ష్మితో పాటు సుమారు 30 మంది రామమాల వేసి దీక్ష చేస్తున్నట్టు వివరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నసమారాధనలు చేపడుతున్నామన్నారు.

గౌరీపరమేశ్వరుల పండగ

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలఅగ్రహారం గ్రామంలో గౌరీపరమేశ్వరుల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భజనలు, చిడతల డ్యాన్స్‌లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం గ్రామంలో తీర్థం నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

వసతిగృహాల్లో విద్యార్థుల సంక్షేమం


రూ.16 లక్షలు మంజూరైన బాలికల వసతిగృహం ఇదే..

ఎట్టకేలకు హాస్టల్ భవనాల మరమ్మతులు
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మారుతున్న రూపురూఖలు
నిధుల మంజూరుతో చకచకా పనులు
తీరనున్న మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సమస్యలు

'పైకే చూడాలా.. పాఠాలే చదవాలా' ఇదీ వసతిగృహాల్లో విద్యార్థుల దుస్థితి. భవనాలు పాడుబడడం.. శ్లాబు పెచ్చులు ఊడిపడుతుండడం.. వర్షాలు కురిస్తే నీరు కారుతుండడం.. వెరసి ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీసేవారు. గచ్చులు కూడా పెచ్చులు లేచిపోవడంతో పడుకోవడానికి పడరాని పాట్లు పడేవారు. ఇక మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, రన్నింగ్ వాటర్ సదుపాయం కొరవడడం ఫలితంగా అదనంగా కష్టాలు ఎదుర్కొనేవారు. ఇదంతా గత చరిత్ర.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతిగృహాల రూపురేఖలు మారుతున్నాయి. నాతవరం మండలంలో ఎస్సీ వసతి గృహాలకు నిధులు మంజూరు కావడంతో భవనాల మరమ్మతు పనులు చకచక జరుగుతున్నాయి. విద్యార్థులు ఎప్పటి నుంచో పడుతున్న కష్టాలకు గట్టెక్కనున్నాయి.

నాతవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాతవరం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం మరమ్మతుల కోసం రూ.16 లక్షలు, బాలికల వసతి గృహం మరమ్మతులకు రూ.16 లక్షలు, చమ్మచింత బాలుర వసతి గృహానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో బాలుర వసతి గృహాల్లో మరమ్మతు పనులు చురుగ్గా చేపడుతున్నారు. నాతవరం బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేవు. అలాగే స్నానపు గదుల శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. వసతి గృహం శ్లాబ్ కూడా లీకేజీలు అవుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి. శ్లాబ్ లీకేజీతో పాటు పెయింటింగ్ పనులు, మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేస్తున్నారు.

అలాగే నాతవరం బాలికల వసతి గృహంలో కూడా రూ.16 లక్షలతో మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే మూడు ఎస్సీ వసతి గృహాల్లో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు పడుతున్న కష్టాలు తీరిపోతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


తలుపులు లేని బాలుర వసతిగృహం మరుగుదొడ్లు


బాలుర వసతిగృహం భవన శ్లాబ్ మరమ్మతు చేస్తున్న దృశ్యం

త్వరలోనే విద్యార్థుల కష్టాలు తీరుతాయి..

-ఆర్.శివ, వార్డెన్, నాతవరం ఎస్సీ బాలుర వసతిగృహం

నాతవరం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్ లీకేజీలు, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా అవస్థలు పడేవారు. ప్రస్తుతం ఎస్సీ బాలుర వసతి గృహానికి అధికారులు రూ.16 లక్షలు మంజూరు చేయడంతో మరమ్మతు పనులను చురుగ్గా చేపడుతున్నాం. త్వరలోనే విద్యార్థుల కష్టాలు తీరుతాయం.


వసతిగృహం గదుల శ్లాబు పెచ్చులు ఊడుతున్న దృశ్యం

రూ.12 లక్షలతో జోగంపేట హాస్టల్ మరమ్మతులు

గొలుగొండ: మండలంలోని జోగంపేట సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహం మరమ్మతుల కోసం రూ.12 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరమ్మతుల పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. జోగంపేట హైస్కూల్‌కు అదే గ్రామంలో వసతి గృహం ఏర్పాటు చేశారు. గత ఏడాది వసతి గృహ భవనాలు వర్షాలకు శిథిల స్థితికి చేరాయి. వర్షం పడితే శ్లాబు నుంచి నీరు కారిపోవడంతో విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారు. ఈ సమస్యను నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.12 లక్షలు మంజూరయ్యాయి. పనులు చురుగ్గా జరగడంతో తల్లిదండ్రులు ఆనందపడుతున్నారు.

ఇంటర్వ్యూ..

కుక్కల బెడద నివారణకు కు.ని. చికిత్సలు

-బి.నారాయణరావు, ఈవో, చోడవరం



చోడవరంలో కుక్కల నివారణ కోసం సంతాన నిరోధ చికిత్స (కు.ని) అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రైతుబజారు ఏర్పాటు ప్రక్రియ మార్చికి మారింది. కోడ్ ముగిసిన వెంటనే రైతుబజారును ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పంచాయతీ దుకాణాల సముదాయాల పైభాగంలో మరిన్ని దుకాణాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం పెంచుకునే చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: చోడవరం పంచాయతీలో కుక్కల బెడద నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కుక్కలకు సంతాన నిరోధ చికిత్సలు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలో ఈ సమస్య నివారణ అవుతుంది.

ప్ర: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలేమిటి?

జ: ఈ సమస్య పరిష్కారానికి తాగునీటి పథకం నిర్వహణ బాధ్యతలను చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రంగం సిద్ధమైంది. తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఆ శాఖ తగిన చర్యలు చేపడుతున్నది.

ప్ర: పంచాయతీ ఆదాయం మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న ప్రణాళికలు ఏమిటి?

జ: పంచాయతీలో ఆదాయం పెంచడానికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పంచాయతీ దుకాణాల సముదాయాల పైభాగంలో మరిన్ని దుకాణాలు నిర్మించి అద్దెకు ఇవ్వాలని చూస్తున్నాం.

ప్ర: పట్టణంలో రైతుబజారు ఎప్పటి నుంచి అందుబాటులోకి రానుంది?

జ: ఫిబ్రవరిలోనే రైతుబజారు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నించాం. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఈ ప్రక్రియ మార్చికి మారింది. కోడ్ ముగిసిన వెంటనే రైతుబజారును అందుబాటులోకి తీసుకువస్తాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

బైక్‌ను కారు ఢీకొని యువకుడి మృతి

▸ మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మూకల రాము (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని కొండల అగ్రహారం గ్రామానికి చెందిన మూకల రాము (24) ద్విచక్ర వాహనంపై అతని భార్య, మేనకోడలుతో కలిసి నర్సీపట్నం నుంచి కొండలఅగ్రహారం వస్తున్నాడు. దాలింపేట గ్రామానికి వచ్చేసరికి ఎదురుగా తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వస్తున్న కారు అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాము తలకు బలమైన గాయం తగిలింది. అలాగే అతని భార్య భవానీ, మేనకూడలు రీతు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని 108లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాము చికిత్స పొందుతూ మృతి చెందగా, గాయపడిన ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధింఇ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. కాగా, ఆదివారం నుంచి కొండలఅగ్రహారం గ్రామంలో గౌరీపరమేశ్వర జాతర ఉంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రాము మృతి చెందడం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తాండవలో సాముహిక అక్షరాభ్యాసాలు


జ్ఞాన సరస్వతిదేవిసన్నిధిలో పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

నాతవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వసంత పంచమి నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో 18 గ్రామాల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులతో సాముహిక అక్షరాభ్యాసాలను వేద పండితులు చేయించారు. విద్యార్థులకు ఉచితంగా పూజా సామగ్రి పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గో గీత జ్ఞాన యజ్ఞం స్వామీజీలు పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది అపన రాజుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశపు నూకరాజు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ రజాక్, ఎంఈవో సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈవో రమణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రేగటి మంగ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు ఆ శాఖ అధికారులే సహకారం

▸ ప్రజా సంకల్ప వేదిక కార్యదర్శి జక్కు నర్సింహమూర్తి

రోలుగుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై ఆ శాఖ అధికారులే సహకారం అందిస్తున్నారని ప్రజా సంకల్ప వేదిక(ఆర్టీఐ) కార్యదర్శి జక్కు నర్సింహమూర్తి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్రమాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. గత ఏడాది నుంచి ఫిర్యాదులు చేస్తున్నా, తప్పుడు నివేదికలు ఇస్తున్నారన్నారు. బినామీ రుణాలు, నిధులు స్వాహాపై విచారణ చేపట్టి అక్రమార్కుల నుంచి సొమ్ములు రికవరీ చేయాలన్నారు. సొసైటీలో సెక్షన్ 51 ద్వారా విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలన్నారు. ఇప్పటికే ఈ సొసైటీలో రూ.40 లక్షలకు పైగా పక్కదారి పట్టాయని విచారణలో నిర్ధారించారని, నేటికీ బాధ్యులపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులే విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారంపై హర్షం


జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాదిగ దండోరా సభ్యులు

రోలుగుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):ఎంఆర్‌పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం రావడం పట్ల పట్ల మాదిగ దండోరా మండల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం రోలుగుంటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కేట్ చేసి డప్పులు వాయిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు, వేల గొంతుకలు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎత్తుల అప్పారావు, ఉపాధ్యక్షుడు కోడి దేముడు, నాయకులు పులగుజ్జుల రాజు, రమణ, పులగుజ్జుల లక్ష్మి, మంజేటి రాజుబాబు పాల్గొన్నారు.


భక్తి శ్రద్ధలతో గాయత్రీదేవి పూజ

కె.కోటపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయంలో వసంత పంచమి సందర్భంగా ఆదివారం గాయత్రీదేవి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి పఠనం జరిగింది. పలు గ్రామాలకు చెందిన 78 మంది బాలబాలికలు పూజలో పాల్గొన్నారు. బండారు నారాయణపాత్రుడు, బండారు రామలక్ష్మి, మురళీకృష్ణ, జేగురుపాటి జోత్స్న, పైలా ధరణి పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

చోడవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా రమణాజీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో సామూహిక ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ తెలిపారు. ఈ అక్షరాభ్యాస కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని ట్రస్ట్ తరపున అందజేస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలతో హాజరైతే సరిపోతుందన్నారు.

గర్నికం సంపద కేంద్రం శిలాఫలకం ధ్వంసం


ధ్వంసమైన గర్నికం సంపద కేంద్రం శిలాఫలకం

రావికమతం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గర్నికం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ కేంద్రం గ్రామ శివారు ఫైర్ స్టేషన్ వెనుకన ఉంది. ఈ ప్రదేశంలో జన సంచారం ఉండదు. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మందుబాబులు రోజూ ఇష్టా రీతిగా మద్యం సేవించిన తర్వాత బాటిళ్లు ధ్వంసం చేసేవారు. అయితే శిలాఫలకం ధ్వంసం కూడా వారి పనే అయి ఉంటుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దార్ ఆఫీస్‌కు సొంత గూడు!

▸ ఐదేళ్లుగా అసంపూర్తిగానే భవన నిర్మాణాలు
▸ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే రాజు
▸ ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్
▸ రూ.1.2 కోట్లతో పీఆర్ ఇంజనీర్లు ప్రతిపాదనలు


చోడవరంలో అసంపూర్తిగా ఉన్న రెవెన్యూ కార్యాలయం భవనం

చోడవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సొంతగూడు లేక తాత్కాలిక భవనాల్లో నడుస్తున్న తహసీల్దార్ కార్యాలయానికి వసతి కష్టాలు త్వరలో తీరనున్నాయి. అసంపూర్తి భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ. కోటి 20లక్షలతో పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనాలను 25 ఏళ్ల క్రితం మావోయిస్టులు బాంబులు పెట్టి పేల్చివేశారు. అప్పటి నుంచి వెలుగుకు చెందిన స్త్రీశక్తి భవనంలో రెవెన్యూ సిబ్బంది కార్యాలయం, మరో చిన్న గదిలో తహసీల్దార్ కార్యాలయం నడుస్తున్నది. కార్యాలయానికి కొత్త భవనాల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో ఎంపీ ల్యాడ్ నిధులు రూ. 50లక్షలతో కొత్త భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. రెండు ఫ్లోర్లకు శ్లాబ్‌లు వేశారు. అయితే ఈ భవనాల నిర్మాణాలకు మంజూరైన నిధులు చాలకపోవడంతో అసంపూర్తిగా ఉండిపోయింది. తరువాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కానీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కానీ రెవెన్యూ కార్యాలయం సంగతి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాకతో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయం భవన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆమె స్వయంగా వచ్చి ఈ భవనాన్ని పరిశీలించారు. గత నెల మండల పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా అసంపూర్తి భవనాలను పరిశీలించి, నిర్మాణాల పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు రూ.కోటి 20లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. దీనిపై పీఆర్ ఈఈ ప్రసాద్ మాట్లాడుతూ, భవనాల పూర్తికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఆమోదం వస్తుందన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణం పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకుని వస్తామని వివరించారు.

ధర లేక కూరగాయల రైతుల దిగాలు

▸ కొనుగోలుదారులు లేక పడిపోయిన ధర
▸ ఉదయం 11 గంటలైనా విక్రయం కాని వైనం


దేవరాపల్లి మార్కెట్‌కు వచ్చిన రైతులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చిన కూరగాయలకు ధర లేక రైతులు దిగాలు పడ్డారు. ఆదివారం ఉదయం 11 గంటల వరకు కొనుగోలుదారుల కోసం రైతులు నిరీక్షించారు. ఆదివారం టమాటా క్రేటు(15 కిలోలు) రూ.200లకు కొనుగోలు చేశారు. గత వారం రూ.300 నుంచి రూ.400 ధర పలికేది. ఆనబకాయ ఒక్కటి రెండు, మూడు రూపాయలకు విక్రయించారు. వంకాయలు క్రేటు (13కిలోలు) రూ.300, బరబాటీ క్రేటు (5కిలోలు) రూ.50 నుంచి రూ.వంద ధరకు పలికింది. సోమవారం మినహా ప్రతి రోజు మార్కెట్ ఉదయం ఆరు గంటల నుంచి 9 గంటలలోపు కూరగాయలు విక్రయించుకొని రైతులు వెళ్లిపోయేవారు. ఆదివారం 11 గంటల వరకు ఉన్నా కూరగాయలు కొనేవారే లేకపోయారు. ఇక్కడ కూరగాయలు విశాఖ పట్నం రైతు బజార్లకు, అనకాపల్లి, విజయనగరం జిల్లా కొత్తవలస, వేపాడ, పాడేరు ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. టన్నుల కొలది కూరగాయలు, ఆకు కూరలు విక్రయాలు జరుగు తాయి. ఆదివారం ధర పడిపోవడంతో కూలి రాలేదని రైతులు వాపో యారు. తెచ్చిన కూరగాయలు మరుసటి రోజు తేలేక అడిగిన ధరకే ఇచ్చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ: యువతి మృతి


రొంగలి లీల (ఫైల్)

భోగాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయ నగరం జిల్లా భోగాపురం మండలంలోని పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన రొంగలి లీల (23) మృతి చెందింది. ఈ ప్రమాదంలో పూసపాటిరేగ మండ లం కోనాడ గ్రామానికి చెందిన అడపాక శివగణేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకారం మండలంలోని ముంజేరు సమీపంలో సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్న ఆరుగురు స్నేహితులు ఆదివారం రాత్రి మూడు ద్విచక్రవాహనాలపై శ్రీకాకుళం వైపు నుంచి తగరపువలస వైపు వెళ్తున్నారు. అయితే పోలిపల్లి, అవనం జంక్షన్ మధ్య హైవేపైకి వచ్చే సరికి అదే రహదారిలో శ్రీకాకుళం నుంచి వెళ్తున్న కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చు న్న రొంగలి లీల రోడ్డుపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో ఎ.శివ గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది.

బెన్నవోలులో పరదేశమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలు గ్రామంలో ఆదివారం పరదేశమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, నాయకులు పాల్గొన్నారు.

చిత్రకారుడు సూర్యనారాయణకు చిత్రకళా ప్రపూర్ణ అవార్డు


సూర్యనారాయణను సత్కరిస్తున్న మంత్రి నిమ్మల రామనాయుడు

చోడవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిత్రకళా నిలయం వ్యవస్థాపకులు, ప్రముఖ చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణ(బాబు)కు చిత్రకళా ప్రపూర్ణ పురస్కారం లభించింది. పాలకొల్లు వడ్డాది పాపయ్య బాపు ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన చిత్రకారుడు సూర్యనారాయణకు చిత్రకళా ప్రపూర్ణ బిరుదును రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అందజేసి, సత్కరించారు. సూర్యనారాయణను స్థానిక పెద్దలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు చీడికాడ విద్యార్థిని ఎంపిక



చీడికాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు చీడికాడ అక్షరశ్రీ విద్యానికేతన్ విద్యార్థిని పోతల సాన్విక ఎంపికైనట్టు ఆ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థిని సాన్విక స్టార్ జూనియర్ లెవెల్-1లో మొదటి స్థానంలో నిలిచింది. ఈనెల 9వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు.